కథ

# ఏప్రిల్ ఫూల్ !!

- రాయప్రోలు రామచంద్రమూర్తి

రవి, రమ ప్రేమించుకున్నారు. రోజూ కలవడం పరిపాటే. ఆరోజు ఏప్రిల్ ఫస్టు. రమని ఎలాగైనా ఫూల్‌ని చేయాలని రవి నిశ్చయించుకున్నాడు. సాయంత్రం ఇద్దరూ బీచ్ ఒడ్డున కలుసుకుని, కొంత దూరం నడిచి, ఇసుకలో కూర్చున్నారు. అంతసేపూ రమ ముభావంగా ఉండడం రవి గమనించాడు. రవి కూడా లోలోపల రమని ఎలా ఫూల్ చేయాలా అని ఆలోచిస్తూ ఏం మాట్లాడలేదు.

ఇంతలో రమ "రవి నేను నీకు ఎంతో కాలంగా ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. కాని దాన్ని నువ్వు పెద్దమనసుతో స్వీకరించకపోతే నాకు నువ్వు కాకుండా పోతావన్న భయంతో చెప్పలేదు. కానీ నా మనసులోని నిజాన్ని ఇంక దాచలేకపోతున్నాను. అందుకే ఈ రోజు ధైర్యం చేసి చెప్పాలన్న నిర్ణయానికి వచ్చాను" అంది.

రవి వచ్చే నవ్వుని ఆపుకున్నాడు. సరే నేనే ఫూల్‌ని చేసే బదులు తనే ఫూల్‌ని చేసుకోబోతోంది అనుకున్నాడు. "సరే చెప్పు" అనడంతో రమ చెప్పనారంభించింది.

రమ : అది కారుమబ్బులు కమ్మిన, కాకులు గూటికి చేరే వేళ. చందమామ తొంగి చూసేవేళ, సన్న జాజులు విరిసేవేళ...

రవి : ఆహా.... ఓహో......

రమ : ఒంటరిగా నేను ఇంట్లో ఉయ్యాల ఊగుతున్నాను.

రవి : లాలీ.... లాలీ..... లాలీ....లాలీ.... ఏం జరిగింది?

రమ : తలుపు కిఱ్ఱుమని చప్పుడైంది. నా గుండె ఝల్లుమంది. మెల్లగా కళ్ళు తెరిచి వచ్చిందెవరో చూశాను.

రవి : ఎవలాలూ......

రమ : బీ సీరియస్ రవి. నల్లని, గుండుమీసాల, గుంట కన్నులవాడు.

రవి : అయ్య బాబోయ్ !

రమ : ఆరడుగుల పొడుగువాడు, ముద్దులిమ్మని నన్ను అడిగాడు.

రవి : ఏయ్ వాణ్ణి నేను నరికేస్తాను.

రమ : ఆవేశపడకు రవి. నేను మొహం దాచుకున్నాను. పోనివ్వనంటూ జడలాగాడు. అంతలో మా అమ్మ వచ్చింది. వెళ్ళవే వెడితే నీకు డబ్బు నగలు ఇస్తాడు అంది. పైగా ముందుకు తోసింది.

రవి : అది తల్లా.... కాదు.... రాక్షసి, పిశాచి, దెయ్యం, తర్వాతేమైందో చెప్పు.

రమ : తప్పని సరై వెళ్ళాను. నన్ను గదిలోకెత్తుకు పోయాడు. వాడి దుప్పట్లో చోటిచ్చాడు.

రవి : ఛీ.... కులటా! పాపాత్మురాలా! నువ్వు నాకొద్దు. వాడి దగ్గరికే పో.... అంటాననుకున్నావు కదూ. అనను. ఎందుకంటే అప్పుడు నీకైదేళ్ళు ఆ వచ్చింది మీ తాతయ్య. ఇప్పుడు నువ్వు చెప్పిన కథంతా 'ఇల్లు-ఇల్లాలు' సినిమాలో రాజబాబు, రమాప్రభ పాడుకున్న హాస్యపుపాట అని నాకు ముందే తెలుసు. కనుక ఏప్రిల్ ఫూల్‌వి నువ్వే అయ్యావు" అన్నాడు గర్వంగా.

రమ ఆశ్చర్యపోతూ "నేను ఆ సినిమా చూళ్ళేదు. ఇది పాటని అంతకన్నా తెలీదు. నేను నిజమే చెప్పాను. నాకప్పుడు 14 ఏళ్ళు. ఆ వచ్చింది మా తాతయ్య కాదు. మావూరి మునసబు రాయుడు. నాకన్నె చెర

విడిపించడానికి వచ్చాడు. అప్పట్లో మా వూళ్ళో ఆ దుస్సంప్రదాయం ఉండేది" అంది ఏడుస్తూ.

రవి ముఖంలో నెత్తురు చుక్కలేదు. ఇంకా ఫూల్‌ని చేస్తుందేమోనన్న అనుమానం ఉన్నా రమ ఏడ్పూ, ముక్కుపుటాలు అదరడం చూస్తే నిజమేననిపిస్తోంది ఒక నిర్ణయానికి వచ్చిన వాడిలా దిగ్గున లేచాడు. రవి వ్యవహారం రమకి అర్థమైంది.

"మనకీ రోజుతో బంధం తెగిపోయింది" అన్నాడు.

రమ తేరుకుని నిలుచున్న రవి చేతిని పట్టుకుని లాగింది. రవి వచ్చి రమ ఒళ్ళోపడ్డాడు. రమ తెరలు, తెరలుగా నవ్వుతూ రవి మొహం మీదికి వంగి ముక్కుతో, పెదవులతో చక్కిలిగింతలు పెట్టింది. వ్యవహారం అర్థమై రవి కూడా నవ్వులో శృతి కలిపాడు. "అమ్మదొంగా నిన్ను ఫూల్‌ని చేద్దామనుకుంటే నన్నే ఫూల్‌ని చేశావే నిజమే అనుకున్నా అన్నాడు.

ఇంటికి వెళ్ళాక రమ అబద్ధంలాంటి నిజాన్ని చెప్పి చెప్పకుండా చేసి తన బ్రతుకుని నిలిపిన పాటకి, ఏప్రిల్ ఫస్ట్‌కి "థాంక్స్" చెప్పుకుంది.

